# ప్రేమంటే ఇదేరా!

ప్రేమ. ప్రేమ కథ. ప్రేమించి చూడు. ప్రేమాభిషేకం. ప్రేమ కానుక. ప్రేమ మందిరం. ప్రేమ తరంగాలు. ఇలా ఎన్నో ప్రేమ కథలు. అటు సినిమాల్లోనూ. ఇటు నిజ జీవితాల్లోనూ. ఈనాటి సినిమాల్లో, బట్టలిప్పుకుని, బూతు పాటలు పాడుతూ, వందమందిని కలుపుకుని డాన్స్ చేయటం ప్రేమ. నిజ జీవితంలో అయితే కట్నం, గిట్నం, అమెరికా టిక్కెట్లలతో మామగారి తలకొరివి పెట్టి పెళ్ళి చేసుకోవటం ప్రేమ. అవునా? కాదు.

ఇద్దరు మనుష్యుల అనుబంధం ప్రేమ. రెండు హృదయాల పెనుబంధం ప్రేమ. తల్లికీ తండ్రికీ, బిడ్డ మీద వుండే అనురాగానికీ మమతకీ మారు పేరు ప్రేమ. పిల్లల-తల్లిదండ్రుల మధ్యా, అక్కచెల్లెళ్ళ-అన్నదమ్ముల మధ్యా వుండే బాంధవ్యానికి భాష్యం ప్రేమ.

ఒక మనిషికీ ఇంకొక మనిషికీ మధ్య వుండవలసిన స్నేహం పేరు ప్రేమ.

విశ్వ మానవ సౌభ్రాతృత్వానికి నిర్వచనం ప్రేమ.

మరి ఈ ప్రేమ పేరుతో సంవత్సరానికి ఒక్కరోజు పండగ చేసుకోవటం తప్పా? ప్రేమని ప్రేమించటంలో తప్పేమిటి అంటారు కొందరు.

తప్పా, తప్పున్నరా? ప్రేమ అంగడి సరుకు కాదు, బజార్న పడేయటానికి అంటారు ఇంకొందరు.

0 0 0

ఫిబ్రవరి నెలలో ప్రపంచంలోని చాల దేశాల్లో వాలెంటైన్ డే (ప్రేమికుల రోజు) సరదాగా జరుపుకుంటారు. ఇది మొదట్లో మతపరంగా మొదలయిన పండగ. క్రీస్తు శకం 270లో లూపర్కాలియా అనే పేగన్ పండగ సమయంలో మొదలయిందిది. సైంట్ వాలంటైన్ చనిపోయిన ఫిబ్రవరి నెలలో జరుగుతుంది.

రోమ్ నగరంలో పెళ్ళికాని యువతులు వారి పేర్లని వ్రాసి, ఒక పెద్ద డబ్బాలో పడేస్తారుట. పెళ్ళికాని కుర్రాళ్ళు తలా ఒకటీ తీసుకుని, ఎవరి పేరు వస్తే వాళ్ళని పెళ్ళి చేసుకునేవాళ్ళుట. ఆ రోజుల్లో ఇలాంటి పెళ్ళిళ్ళు ఎన్నో ఇలాగే జరిగేవిట.

అయినా మొట్టమొదటి వాలెంటైన్ రోజు ఇంగ్లాండ్‌లో జరిగిందంటారు. అమెరికాలో 1700లో మొదలయింది. 1840నించీ మనుష్యులమీద ప్రేమతో పాటూ ధనలక్ష్మీ ఐ లవ్ యు అని డబ్బు మీద కూడా ప్రేమ పెరిగింది మొట్టమొదటగా అమెరికాలోనే. వాలంటైన్స్ రోజు అమ్మకాలలో ముఖ్యమైనవి నాలుగు. పువ్వులు, గ్రీటింగ్ కార్డులు, చాకొలెట్లు, రెస్టారెంట్లల్లో భోజనాలు. 1995 నాటికి 26,400

పూల వర్తకులు, 1,23,600 మంది ఉద్యోగస్తులతో పూలు అమ్మారుట. ఒక్క కొలంబియానించే 300 మిలియన్ల డాలర్ల పైన విలువచేసే పూలని దిగుమతి చేసుకుంటారుట. అలాగే గ్రీటింగ్ కార్డుల అమ్మకాలలో, క్రిస్మస్ తర్వాత ఎక్కువగా గ్రీటింగ్ కార్డులు అమ్మేది ఈ పండగకే. అలాగే చాకొలెట్లూనూ. ఏ రెస్టారెంట్‌కి వెళ్ళినా కనీసం గంటసేపు సీటు కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. 2005లో వాలంటైన్స్ డే రోజున 13.2 బిలియన్ డాలర్లు అమెరికాలో ఖర్చు పెడతారని అంచనా వేశారుట!

చాలమందికి తెలియనిది ఇంకొకటుంది. కొంతమంది మహానుభావులు కలిసి అమెరికాలో మొదలు పెట్టిన 'యాంటీ వాలంటైన్స్ డే'. అంటే ప్రేమకి వ్యతిరేక దినం. ఇది నిజంగా నిజం. వాలంటైన్స్ డే అయిన మర్నాడే కొంతమంది చేసుకుంటారిది.

ప్రేమకి వ్యతిరేకమా? ప్రేమ బదులు ద్వేషాన్ని బలపరిచే మనుష్యులా వాళ్ళు? అసలలాటి వాళ్ళు వుంటారా? ఉంటే ఎలాంటి వారు ఈ విలన్లు?

0 0 0

'ఈ హడావిడి అంతా బిజినెస్ కోసమే. ప్రపంచమంతా కొన్ని బిలియన్ల డాలర్లు ఖర్చు పెడతారీ రోజు. పూలమ్ముకునే వాళ్ళూ, గ్రీటింగ్ కార్డు కంపెనీలూ, చాకొలెట్ కంపెనీలు సృష్టించిన పండగ ఇది. ప్రేమని అంగడి వస్తువుగా మార్చేశారు' అంటాడొకడు.

అసలా ఒక్క రోజే ప్రేమ రోజంటే ఎలా. మిగతా రోజుల్లో మనకి ప్రేమ లేదా? అంటాడింకొకడు.

మొన్నీమధ్యనే విడాకులు తీసుకున్నాం మేం. ఇంకా ప్రేమేమిటి నా ముఖం అంటుందొకావిడ.

'జీవితాంతం సింగిల్‌గా వుందామనుకుంటున్నాం. దాంట్లో వున్న ఆనందం ఇక దేంట్లోనూ లేదు. ప్రేమా లేదు. దోమా లేదు' అంటారు ఏకో నారాయణులూ, నారాయణిలూ.

వీళ్ళు ఇలా అని వూరుకోవటమే కాదు, చాల వూళ్ళల్లో యాంటీ వాలంటైన్స్ డే జరుపుకుంటున్నారు కూడాను. ఎన్నో చోట్ల సింగిల్స్ పార్టీలు దీనికి నిరసనగా చేస్తున్నారు. ఎన్నో వెబ్ సైట్లూ వున్నాయి.

గమ్మత్తేమిటంటే వీళ్ళకీ ఆ రోజున వేసుకోవటానికి టీ షర్టులు, అలాటి రకరకాల వస్తువులూ వున్నాయి.

'వాలంటైన్స్ డే మరి వ్యాపార మయమయిందన్నారు కదా, మరి మీ యాంటీ వాలంటైన్స్ డే వ్యాపారపరమవలేదా' అని అడిగేవాళ్ళూ వున్నారు.

'ఏదో నామమాత్రంగా కొన్ని అమ్మకాలు చేస్తే, దీనికీ దానికీ పొంతన ఎక్కడ' అనేవాళ్ళూ వున్నారు.

'ప్రేమంటే తెలియని పిచ్చివాళ్ళు. సంవత్సరానికొకసారి సరదాగా పండగ చేసుకుంటూ, కాస్తో కూస్తో డబ్బులు ఖర్చు పెట్టుకుంటుంటే కొంపలేమీ అంటుకు

పోవు. అంతేకాదు దేశ ఆర్థిక పరిస్థితికి మంచిది కూడాను' అంటాడింకొకాయన.

'ఈ ప్రపంచీకరణలో మన దేశానికే కాదు, ప్రపంచ ఆర్థిక పరిస్థితికే లాభం' అంటుందొక వాల్ స్ట్రీట్ వనిత.

ఈ వాలంటైన్స్ డే ఇండియాకీ దిగుమతి అయింది. ప్రేమ సార్వజనీయం. మంచిదే కానీ ఈ చివరకుగానీ ఆ చివరకుగానీ లాక్కుపోయి వెర్రితలలు వేయ కూడదు. కానీ సరిగ్గా అలాగే జరిగి ప్రేమ పేరుతో విద్వేషాలు పెరిగి, గొడవలు అవుతున్నాయని చదివాను.

అలాగే 'ఇది మన సంస్కృతి కాదు. మన మత సంబంధమూ కాదు పాశ్చాత్యులు పన్నిన కుట్ర' అని అరుస్తున్న వాళ్ళూ వున్నారుష. ఈ సంవత్సరం ఏం జరిగిందో నాకు తెలీదు కానీ, గత కొన్ని సంవత్సరాలుగా బొంబాయిలో ఒక సేనవారూ, ఢిల్లీలో ఒక పరిషత్‌వాళ్ళూ ఇంకో రాజకీయ పార్టీ, దీనిమీద రాద్ధాంతం కూడా చేశారని చదివాను. బందులూ హర్తాళ్‌లూ, రోజూ సూర్యుడు ఉదయించి నంత సహజంగా, మన సంస్కృతిలో భాగమయిపోయాయి. కాకపోతే పూలమ్ముకుని ఏరోజుకారోజు బ్రతికేవారి పూల దుకాణాలూ, స్వీటు షాపులూ ధ్వంశం చేశారుట. బస్సులూ షాపులూ తగలబెట్టారుట. తమ నోటి దగ్గర కూడు పోయిందని వాళ్ళు బాధ పడుతుంటే, వీళ్ళు సాధించినదేమిటో అర్థం కాదు. కారణం? ఆ ప్రేమ అనేది రోడ్డుకెక్కకూడదు. అది భారతీయ సంస్కృతికి విరుద్ధం. దానితో వ్యాపారం చేయ కూడదు అని. ప్రేమికులని ఈ ప్రేమికుల రోజు పాడు చేస్తున్నదనిట!

ఇది చదివిన తర్వాత, అదే పుస్తకంలో ఇంకా విచిత్రమైనవి చదివాను. పైన చెప్పిన సంస్థలలో పాల్గొనేవారిలోనూ, కొంతమంది పాలకులలోనూ సినిమా నటులు వున్నారుట. బట్టలు విప్పుకుని కుప్పిగంతులు వేసేవాళ్ళూ, బూతు పాటలకి డాన్స్ చేసే వాళ్ళతో సహా. మరి అటువంటి నిర్వీర్యం చేసే సినిమాలు ప్రేమకి ప్రతీకలా? ఈనాటి మన సినిమాలు ఇంతకన్నా ఎక్కువగా ప్రజలని పాడుచేయటం లేదా?

ఇంకొక విషయం కూడాను. హిందువులు ఇండియాలో దీపావళి పండగ చేసుకుంటుంటే, మిగతా మతాలవారు కూడా దీపాలు పెట్టుకుని టపాకాయలు కాల్చుకుంటున్నారు. అలాగే అమెరికాలో మేం కూడా క్రిస్మస్ పండగ చాల సరదాగా చేసుకుంటాం. ఇక్కడ మతంతో పనిలేదు. సంతోషంగా వుండటం కోసం చేసేవివన్నీ. అలాగే వ్యాపారం. దీపావళికి మన దేశంలో ఏటేటా ఎన్ని కోట్ల రూపాయలు టపాకాయలకీ, గ్రీటింగ్ కార్డులకీ, స్వీట్లకీ ఖర్చుపెడుతున్నాం? ఇదీ అలాగే.

ఇవేవి మనం చేయకపోయినా ఎవరూ కొట్టరు. ఎవరి సంతోషం కోసం వాళ్ళు చేసుకునేవి ఇవన్నీ. ఇంకొకళ్ళని బాధ పెట్టనంతవరకూ, నష్టం కలిగించనంత వరకూ, న్యాయబద్ధం అయినంతవరకూ, ఇలాటివి ఇష్టంలేని వాళ్ళు మిగతా వాళ్ళకి అడ్డం రాకుండవుంటే వ్యక్తి స్వాతంత్ర్యానికి విలువ వుంటుంది.

ప్రేమ చూపించకపోయినా, ద్వేషం చూపించక పోవటమే ఈ 'వాలంటైన్స్ డే' కి అర్థం కదూ!

ప్రేమ మీద ద్వేషమా! భళిరా భళి!